ప్రభాత
తెలుగు దినపత్రిక
jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 01
సంచిక : 31
పేజీలు : 8
వెల : 4
మల్కాజిగిరి
శనివారం, 12-08-2023

జయభేరి దినపత్రిక, జయభేరి ఛానల్‌లో
నిఖార్సైన జర్నలిస్టులుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు.. కథనాలు...
ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలనుకుంటున్నారా?
మీ కలాలకు పదును పెట్టండి....
విలేకర్లు కావలెను
ఆసక్తి కలిగిన యువతి యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com
9391 544 889 call me

## 23న చంద్రుడికి చంద్రయాన్
# సాఫ్ట్ ల్యాండింగ్



**జయభేరి, బెంగళూరు, ఆగస్టు 11 :**


భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్ 3 జాబిల్లికి మరింత దగ్గరయ్యింది. ఈసారి వ్యోమనౌక కక్ష్య కొంచెం తగ్గించినట్లు ఇస్రో పేర్కొంది. దాని వలన ప్రస్తుతం చంద్రయాన్3 వ్యోమనౌక.. చంద్రుడి ఉపరితలానికి కేవలం 1,437 కిలో మీటర్ల దూరంలో ఉంది. చంద్రయాన్ 3 ని ప్రయోగించిన తరువాత సుమారు 24 రోజుల పాటు భూ కక్ష్యలోనే ఉంది. అప్పటి నుంచి దశల వారీగా కక్ష్యను పెంచుతూ ఆగస్టు 5న చంద్రుడి కక్ష్యలోనికి ప్రవేశ పెట్టారు. ఆగస్ట్ 1 న ట్రాన్స్‌లూనార్ కక్ష్యలోకి వెళ్లింది. ఆగస్టు 14న చంద్రయాన్ 3 మరో నియంత్రిత కదలికలో చంద్రుని ఉపరితలానికి చేరవవుతుంది. ఆగష్టు 16న విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌లతో కూడిన ల్యాండింగ్ మాడ్యూల్.. దాని ప్రొపల్షన్ సిస్టమ్ నుంచి వేరు పడుతుంది. దీంతో చంద్రయాన్ 3 చంద్రునికి మరింత దగ్గర కానుంది. ఈ సమయంలో చంద్రుడికి దాదాపు 110 కి.మీ దూరంలో ఉంటుంది. చివరిగా ఆగస్టు 18న చంద్రయాన్ 3 లాస్ట్ ఆర్బిట్ మాడ్యులేషన్ ను సరిచేయడం వల్ల దాదాపు 30 కి.మీ లకు తగ్గించడం ద్వారా చంద్రునికి అత్యంత సమీపంగా వెళ్లనుంది. అనుకున్నది అనుకున్నట్లుగా జరిగితే కనుక ఆగస్టు 23న సాయంత్రం 5: 47 గంటలకు చంద్రయాన్ 3 ల్యాండింగ్ చేపట్టనున్నారు. అక్కడి నుంచి చంద్రయాన్ 3 ఆఖరుగా 30 కి.మీ ప్రయాణిస్తుంది. ఒకవేళ అక్కడి వాతావరణం కానీ అనుకూలించకపోతే కనుక సెప్టెంబర్ కు రీ షెడ్యూల్ చేసే అవకాశం ఉన్నటుల ఇస్రో పేర్కొంది. ఇస్రో మాత్రం ఈసారి పక్కా ప్లాన్ తో ముందుకు వెళ్తున్నట్లు కనిపిస్తోంది. ఎందుకంటే చంద్రయాన్ 2 చివరి ప్రయత్నంలో ఫెయిల్ అయ్యింది. దీంతో ఈసారి ఇస్రో శాస్త్రవేత్తలు దాని నుంచి చాలా పాఠాలు నేర్చుకున్నారు. ఇప్పటికే అప్పుడు పొరపాటు మళ్లీ పునరావృతం కాకుండా చంద్రయాన్ 3 ని చేపట్టినట్లు ఇప్పటికే ఇస్రో ఛైర్మన్ పేర్కొన్నారు. కానీ, చంద్రయాన్ 3 చంద్రుడి ఉపరితలానికి 100 కిలోమీటర్ల వరకూ ఎలాంటి ఇబ్బంది ఉండదని, ఆ తర్వాత ప్రక్రియ చాలా సవాల్‌తో కూడుకున్నదని ఇస్రో ఛైర్మన్ చెప్పారు. ల్యాండర్ విక్రమ్, అన్ని సెన్సార్లు, దాని రెండు ఇంజిన్లు పని చేయక పోయినా ఆగస్టు 23 న చంద్రుని ఉపరితలంపై సాఫ్ట్‌ల్యాండింగ్ చేయగలదని వివరించారు.



2 లో

- వీటి స్థానాల్లో 'భారతీయ న్యాయ సంహిత' కొత్త చత్తం
- మైనర్లను అత్యాచారం చేస్తే ఉరిశిక్ష
- సామూహిక అత్యాచారానికి పాల్పడితే 20 ఏళ్ల జైలు
- మూక దాడులకు ఏడేళ్ల జైలు
- కీలకమైన మూడు బిల్లులను లోక్సభలో ప్రవేశపెట్టిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా

## ఐపీసీ.. సీసీపీ ఐఈఏ లకు
# గుడ్ బై



# కోట్లు కురిపించిన భూములు

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 11 :**

హైదరాబాద్ లో భూముల వేలానికి అద్భుతమైన స్పందన వస్తున్న నేపథ్యంలో మరోసారి భూముల వేలానికి రాష్ట్ర సర్కారు సిద్ధమైంది. డిమాండ్ కు అనుగుణంగా ప్లాట్లను ఈ వేలంలో అమ్మకానికి పెడుతోంది. నేరుగా ప్రభుత్వమే వేలం నిర్వహిస్తుండటంతో.. చిక్కుల్లేని, అన్ని రకాల అనుమతులు కలిగిన, సంపూర్ణమైన భూ యాజమాన్య హక్కులు ఉండటంతో ప్రభుత్వ భూ వేలానికి అద్భుతంమైన స్పందన వస్తోంది. కొన్ని రోజుల క్రితం హైదరాబాద్ శివారు కోకాపేటలో ఎకరం రూ.100 కోట్లకు అమ్ముడుపోయిన విషయం తెలిసిందే. సర్కారు అధికారులు, రియల్ ఎస్టేట్ నిపుణులు కూడా ఊహించని రీతిలో ఆ వేలానికి రెస్పాన్స్ మిగతా 2 లో




# జూబ్లీహిల్స్ నుంచి పోటీకి అజార్

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 11 :**

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల హీట్ రోజు రోజు పెరుగుతోంది. టికెట్ ఆశావాహులు తమ పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు ఓ వైపు ప్రయత్నాలు చేస్తూనే.. మరో వైపు నియోజకవర్గంల్లో యాక్టవ్ అయ్యారు. దీంతో ఇప్పటికే రాజకీయ పార్టీల నేతలు వ్యక్తిగత ప్రచారాన్ని ముమ్మరం చేశారు. టీమిండియా మాజీ కెప్టెన్, హెచ్‌ఐసీసీ మాజీ అధ్యక్షుడు అజారుద్దీన్ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకీ సిద్ధం అవుతున్నారు. కాంగ్రెస్ మిగతా 2 లో

## 6210 కోట్లు ఆస్తి దానానికి
# త్యాగరాజన్ రెడీ



**జయభేరి, చెన్నై, ఆగస్టు 11 :**

ఈ రోజుల్లో సాధారణ జీవితం గడపడం చాలా అరుదు. ఇప్పుడు ప్రతి ఒక్కరూ ఉన్నతంగా జీవించాలనే అనుకుంటారు. చేతిలో ఐఫోన్, ఖరీదైన కారు, ఇల్లు ఉండాలను కుంటారు. కానీ కోట్లకు పడగలెత్తిన ఓ వ్యక్తి కనీసం చేతిలో ఫోన్‌కూడా ఉపయోగించడంటే నమ్ముతారా? అంతేకాదు చిన్న ఇంట్లో ఉంటూ కేవలం ఐదు వేల డాలర్లు తన వద్ద ఉంచుకుని తన రూ.6210 కోట్లు ఆస్తిని పంచేశాడు. ఆయనే శ్రీరాం చిట్స్ అధినేత టి.త్యాగరాజన్. ఆయన ఎక్కువగా ప్రజల మధ్య జీవించడానికి ఇష్టపడతారు. కొన్నాళ్లుగా ఆయన హ్యుందాయ్ హ్యాచ్‌బ్యాక్ కారు వాడుతున్నారు. మొబైల్ ఫోన్ వ్యసనం అని దానిని వాడనని చెబుతారు. తనకు అప్పుడో ఇప్పుడో డబ్బు అవసరం లేదని చెబుతారు. శాస్త్రీయ సంగీతం వింటూ, పాశ్చాత్య వ్యాపార పత్రికలను గంట పాటు చదువుతూ ఉంటారు. ఏ వాహనం కొనుగోలుకైనా రుణం, ఇన్సూరెన్స్ సేవలు అందిస్తుంది శ్రీరాం చిట్స్. ఇందులో 1,08,000 మందికి పనిచేస్తున్నారు. ఈ సంస్థ షేర్లు ఈ సంవత్సరం 35% పెరిగి జూలైలో రికార్డ్ నమోదు చేశాయి. ఇది భారతదేశపు బెంచ్‌మార్క్ స్టాక్ ఇండెక్స్ కంటే నాలుగు రెట్లు ఎక్కువ. ఈ సంస్థకు అధినేతగా ఉన్న త్యాగరాజన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. సాధారణ ఆదాయం లేని వ్యక్తులకు రుణాలు ఇవ్వడం ప్రమాదకరం కాదని నిరూపించడానికి తాను పరిశ్రమలోకి ప్రవేశించానని చెప్పారు. రూ.6210 కోట్లు ఆస్తిని దానం చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. త్యాగరాజన్ 1974లో చెన్నైలో సంస్థను స్థాపించారు. సామన్య ప్రజల జీవితాల్లో సమస్యలు తొలగించాలని నిర్ణయించుకున్నారు. దేశంలో 1.4 బిలియన్ల మంది ప్రజలు మధ్య తరగతికి చెందినవారు. పేదలకు రుణాలు ఇవ్వడం ఒక రకమైన సోషలిజం అని త్యాగరాజన్ వాదించారు. బ్యాంక్ రేట్ల కంటే తక్కువకు రుణాలు ఇవ్వడం ద్వారా వ్యాపారం సురక్షితం, లాభదాయకంగా ఉంటుందని ఆయన నిరూపించడానికి ప్రయత్నించారు. ప్రస్తుతం దేశంలో 9,400 షాడో బ్యాంక్‌లు ఉన్నాయి. ఇవి ఎక్కువగా సంప్రదాయ రుణదాతల ద్వారా ప్రజలకు ఆర్థిక సేవలను అందిస్తాయి. KPMG ఇండియాలో సీనియర్ పార్ట్‌నర్, కార్పొరేట్ ఫైనాన్స్ హెడ్ శ్రీనివాస్ బాలసుబ్రమణియన్ మాట్లాడుతూ.. కొంతమంది మాత్రమే చాలా కాలం పాటు కొనసాగుతూ అభివృద్ధి సాధిస్తారని అన్నారు. త్యాగరాజన్ చెన్నైలో గ్రాడ్యుయేట్, మాస్టర్స్ స్థాయిలో గణితాన్ని అభ్యసించారు. తరువాత కోల్‌కతాలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో మూడు సంవత్సరాలు చదివారు. 1961లో అతను భారతదేశంలోని అతిపెద్ద బీమా సంస్థల్లో ఒకటైన న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీలో చేరారు. దాదాపు రెండు దశాబ్దాల పాటు వైశ్యా మిగతా 2 లో



# సర్కారీ దవాఖానాల్లో 72 శాతం డెలివరీలు

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 11 :**

తెలంగాణలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఆసుపత్రుల్లో మెరుగైన చికిత్స అందుతోంది. దీంతో గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల వైపు చూస్తున్నారు. కాగా.. తాజాగా డెలివరీల సంఖ్య భారీగా రికార్డు స్థాయిలో పెరిగింది. జూలై నెలలో ప్రభుత్వ ఆసుపత్రి డెలివరీలు 72.8% నమోదు కావడం పట్ల ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్ రావు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల చరిత్రలో ఇది సరికొత్త రికార్డ్ అని వ్యాఖ్యానించారు. ఇందుకు కృషి చేసిన వైద్య సిబ్బందిని మంత్రి అభినందించారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు 30 శాతం డెలివరీలు జరిగితే, ప్రస్తుతం 73 శాతానికి చేరడం సీఎం కేసీఆర్ మార్గనిర్దేశనలో వైద్యారోగ్య శాఖ చేస్తున్న పనితీరుకు, పురోగతికి నిదర్శనం అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెరుగుతున్న డెలివరీలు, ప్రభుత్వ ఆసుపత్రులపై పెరుగుతున్న ప్రజల విశ్వాసానికి, నమ్మకానికి మంచి ఉదాహరణలు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా నారాయణ్ పెట్ జిల్లాలో 86.9%, మెదక్ 83.5%, జోగులాంబ గద్వాల్ 81.1% డెలివరీలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరగటం అభినందనీయం అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి డెలివరీలు తక్కువగా నమోదు అవుతున్న వరంగల్, హన్మకొండ, సూర్యాపేట, నిర్మల్ జిల్లాల్లో ఫలితాలు మెరుగుపడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సగటు కంటే తక్కువ నమోదు అవుతున్న జిల్లాలపై వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఓవరాల్ పెర్ఫార్మెన్స్ విషయంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జోగులాంబ గద్వాల్, మెదక్, నాగర్ కర్నూల్ జిల్లాలను మంత్రి అభినందించారు. చివరి స్థానంలో ఉన్న హన్మకొండ, మహబూబాబాద్, కామారెడ్డి జిల్లాలో పనితీరు మెరుగు పడాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏర్పాటు చేసిన టిఫా స్కానింగ్ మిషన్ల వల్ల గర్భిణులకు ఎంతో మేలు అవుతుందన్నారు. 43 ఆసుపత్రుల్లో, ఏర్పాటు చేసిన 56 టిఫాల ద్వారా 32 వేల స్కాన్స్ చేయడం అభినందనీయం మిగతా 2 లో

ప్రభాత జయభేరి
jayabheridaily.com

▶▶ మొదటిపేజీ తరువాయి

## 6210 కోట్లు ఆస్తి దానానికి త్యాగరాజన్ రెడీ

బ్యాంక్, రీఇన్స్యూరెన్స్ బ్రోకర్ సంస్థ JB బోడా & కోలో పనిచేశారు. తరువాత స్నేహితులు, బంధువులు సాయంతో శ్రీరామ్ సంస్థను ఏర్పాటు చేసి భీమా నుంచి స్టాక్ బ్రోకింగ్ వరకు 108,000 మందికి ఉపాధి కల్పించారు. అలాగే వాహనాల కొనుగోలుకు సాధారణ ప్రజలకు రుణాలు అందించారు. క్రమక్రమంగా కంపెనీని అభివృద్ధి చేశారు. శ్రీరామ్స్ సంస్థల కారణంగా వడ్డీ రేట్లు 30%35% నుంచి 17% 18%కి తగ్గాయి. ప్రస్తుతం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ మార్కెట్ విలువ సుమారు $8.5 బిలియన్లు. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో సుమారు $200 మిలియన్ల లాభాలను ఆర్జించింది. స్టాక్‌ను ట్రాక్ చేస్తున్న 34 మంది విశ్లేషకులలో ఒకరు మాత్రమే దానిని విక్రయించాలని సిఫార్సు చేస్తున్నారు. అంతేకాకుండా శ్రీరామ్ గ్రూప్ దాదాపు 23 మిలియన్ల కస్టమర్లకు సేవలు అందిస్తోంది. పేదలకు రుణాలు మంజూరు చేసే క్రమంలో బ్యాంకుల తరహాలో శ్రీరామ్స్ సంస్థలు క్రెడిట్ స్కోర్‌లను చూడదని, బదులుగా గతంలో వినియోగదారుల సూచనలపై ఆధారపడుతుందని త్యాగరాజన్ వివరించారు. అంతర్గతంగా, కంపెనీ పరిహారం కోసం ఒక ప్రత్యేకమైన విధానాన్ని కూడా తీసుకుంటుంది. మార్కెట్ ధరల కంటే తక్కువ ధరకే లభిస్తున్నప్పటికీ సిబ్బందికి ఎక్కువ జీతం ఇవ్వాలని త్యాగరాజన్ చాలా కాలంగా నమ్ముతున్నారు. 'ఈ ఉద్యోగం అందించే మనశ్శాంతి, స్థిరత్వం, సౌకర్యానికి విలువ ఇస్తాను' అంటూ ముంబైకి చెందిన శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్ తెలిపారు. అలాగే శ్రీరామ్ గ్రూప్ ఉద్యోగులు సంతోషంగా ఉన్నారని, వారు ఎక్కువ ఒత్తిడికి గురికానివ్వమని త్యాగరాజన్ తెలిపారు.వ్యాపారవేత్త శ్రీరామ్ కంపెనీలలో తన వాటాలన్నింటినీ ఉద్యోగుల సమూహానికి ఇచ్చి, వారిని 2006లో ఏర్పాటు చేసిన శ్రీరామ్ ఓనర్‌షిప్ ట్రస్ట్‌కు బదిలీ చేశారు. శాశ్వత ట్రస్ట్‌లో 44 గ్రూప్ ఎగ్జిక్యూటివ్‌లు ఉన్నారు. ఎగ్జిక్యూటివ్‌లు పదవీ విరమణ చేసినప్పుడు లక్షలాది డాలర్లు తీసుకుని వెళ్లిపోతారు. ట్రస్ట్ హోల్డింగ్ యొక్క మొత్తం విలువ $750 మిలియన్లను మించిపోయింది.డిసెంబర్‌లో శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కో. శ్రీరామ్ క్యాపిటల్ లిమిటెడ్, శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌లను షేర్‌స్వాప్ డీల్‌లో విలీనం చేసుకుంది. శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ట్రక్కులకు ఆర్థిక సహాయం చేస్తుంది, శ్రీరామ్ సిటీ యూనియన్ వినియోగదారుల వస్తువులు, మోటార్‌సైకిళ్ల కొనుగోళ్లకు నిధులు సమకూరుస్తుంది. ఎగ్జిక్యూటివ్‌లు ఏళ్ల తరబడి ప్లాన్ చేశారని, అయితే ఆ వివరాల్లో తనకు సంబంధం లేదని త్యాగరాజన్ చెప్పారు. కానీ ప్రతి పదిహేను రోజులకు, సీనియర్ మేనేజర్లు ఆయనకు సంస్థ గురించి క్లుప్తంగా వివరిసస్తారు. ఆయన సలహాలు తీసుకుంటారు.

## సర్కారీ దవాఖానాల్లో 72 శాతం డెలివరీలు

అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీలకు గాను గత ఏడాది కాలంలో కోటి 60 లక్షలు వైద్య సిబ్బందికి టీం బేస్డ్ ఇన్సెంటివ్ రూపంలో ఇచ్చినట్లు చెప్పారు. బిడ్డకు మొదటి గంటలో తల్లి పాలు అందించడం, సాధారణ ప్రసవాలపై కౌన్సిలింగ్ నిర్వహించడం వంటివి చేయాలని అధికారులకు సూచించారు. వ్యాక్సినేషన్ విషయంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన కరీంనగర్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలను మంత్రి అభినందించారు. హన్మకొండ, మంచిర్యాల, ఖమ్మం జిల్లాల్లో పనితీరు మెరుగు పడాలని ఆదేశించారు. వ్యాక్సినేషన్ విషయంలో తెలంగాణ దేశంలో నెంబర్ 1 స్థానంలో ఉండేలా అందరం కలిసి కృషి చేయాలన్నారు. 24 గంటల పాటు సేవలు అందించి, నవజాత శిశు అరోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎక్కువ మందికి వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. ఉచిత పరీక్షలు నిర్వహించి, క్వాలిటీ వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. తెలంగాణ డయాగ్నొస్టిక్ ద్వారా అందిస్తున్న 134 రకాల పరీక్షలు ప్రజలకు అందాలన్నారు. 24 గంటల్లోగా పరీక్షల ఫలితాలు అందించేలా చూడాలన్నారు.

## కోట్లు కురిపించిన భూములు

రావడంతో.. సర్కారు ఖజానాకు ఢోకా లేకుండా పోయింది. తాజాగా రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో భూముల విక్రయానికి తాజాగా హెచ్ఎండీఏ నోటిఫికేషన్ విడుదల చేసింది. రంగారెడ్డి జిల్లాలోని బైరాగిగూడ, మంచిరేవుల, పీరం చెరువు, కోకాపేట, నల్లగండ్ల, బుద్వేల్, చందానగర్ లో ప్లాట్లను విక్రయించనుంది సర్కారు. మేడ్చల్ లో బాచుపల్లి, బౌరంపేట, చెంగిచర్ల, సూరారం, సంగారెడ్డిలో వెలిమల, నందిగామ, అమీన్ పూర్, రామేశ్వరం బండ, పతిఘన్ పూర్, కిష్టారెడ్డి పేటలో స్థలాలు విక్రయించనుంది. కాగా ఈ నెల 16వ తేదీన రిజిస్ట్రేషన్లు స్వీకరించనుంది. ఒక్కో ప్లాటుకు ఈఎండీ రూ. 5 లక్షలు, ఈఎండీ చెల్లింపునకు చివరి తేదీ 17 ఆగస్టు. 18వ తేదీన రెండు సెషన్ లలో ఈ వేలం నిర్వహించనున్నారు అధికారులు. స్థల సందర్శన, వివరాలకు హెచ్ఎండీఏ వెబ్ సైట్ లో బ్రోచర్ ను చూడవచ్చు. అలాగే వేలం పాడే సమయంలో కనీస బిడ్ పెంపుదల (చదరపు గజానికి) రూ. 1000 చొప్పున పెంచుకోవచ్చు.రంగారెడ్డి జిల్లాలో సర్వే నంబర్ 5, 430, 44, 144, 161, 188, 174, 89 సర్వే నంబర్లలో స్థలాన్ని విక్రయించనున్నారు. అలాగే మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా పరిధిలోని సర్వే నంబర్ 363, 425, 694, 130, 33/1, 166, 167 సర్వే నంబర్లలోని స్థలాను విక్రయానికి ఉంచారు. సంగారెడ్డి జిల్లా పరిధిలో 507, 823(పి 1), 823 (పి 2), 823 (పి 3), 250, 227, 273, 281, 177 సర్వే నంబర్లలోని స్థలాన్ని విక్రయానికి ఉంచారు.హైదరాబాద్ లో హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన ప్లాట్లను మరోసారి వేలం వేసేందుకు సిద్ధం అయింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్ మెంట్ అథారిటీ (HMDA) ప్రభుత్వ స్థలాల్లో అభివృద్ధి చేసిన మరికొన్ని ప్లాట్లను విక్రయానికి పెట్టింది. హైదరాబాద్ శివార్లలోని బాచుపల్లిలో 133 ప్లాట్లు, మేడిపల్లిలో 85 ప్లాట్లకు వచ్చే నెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఆన్ లైన్ లో వేలం నిర్వహించనున్నారు. నిజాంపేట మున్సిపాలిటీ పరిధిలోని బాచుపల్లిలో 27 ఎకరాలు, మేడిపల్లిలో 55 ఎకరాల ప్రభుత్వ స్థలంలో హెచ్ఎండీఏ భారీ లే అవుట్లను అభివృద్ధి చేసింది. మార్చిలో మొదటి విడత కింద కొన్ని ప్లాట్లను విక్రయించగా కొనుగోలుదారుల నుంచి మంచి స్పందన లభించింది. దీంతో తాజాగా రెండో విడత కింద రెండు లే అవుట్లలోని ప్లాట్లను విక్రయించేందుకు హెచ్ఎండీఏ నోటిఫికేషన్ ను జారీ చేసింది. బాచుపల్లిలో చదరపు గజానికి రూ.25 వేలు, మేడిపల్లిలో రూ.32 చొప్పున ఉండాలని నోటిఫికేషన్ లో సూచించింది. మరింత సమాచారం కోసం హెచ్ఎండీఏ వెబ్ సైట్ , ఎంఎస్ టీసీ ఈ కామర్స్, ఎంఎస్టీసీ ఇండియా వెబ్ సైట్లను సంప్రదించాలని తెలిపింది. లేఅవుట్ ల సందర్శనకు, సందేహాల నివృత్తి కోసం 7396345623, 915484321 నంబర్లకు సంప్రదించాలని అధికారులు తెలిపారు.

## జూబ్లీహిల్స్ నుంచి పోటీకి అజార్

పార్టీ నేతగా ఉన్న అజారుద్దీన్ ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భావిస్తున్నారు. అజారుద్దీన్ 2009లో కాంగ్రెస్ పార్టీ తరపున పార్లమెంటు సభ్యునిగా ఉత్తరప్రదేశ్ లోని మురాదాబాద్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ నియోజవర్గంలో యాక్టివ్ గా మారారు. అజారుద్దీన్ తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల్లో కొన్ని రోజుల నుంచి క్రియాశీలకంగా వహరిస్తున్నారు. అనుచరులతో కలిసి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పర్యటన చేయడంతో రాజకీయ కాక పీక్స్ కు చేరింది. నియోజక వర్గంలో పర్యటించడమే కాకుండా ప్రజలు కొత్త ముఖాన్ని కోరుకుంటున్నారంటూ.. అజారుద్దీన్ ప్రకటన చేశారుదీంతో విష్ణువర్థన్ రెడ్డి వర్సెస్ అజారుద్దీన్‌గా రాజకీయం టర్న్ తీసుకుంది. అజారుద్దీన్ తీరుపై విష్ణువర్థన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌తో తనకు 16 ఏళ్ల అనుబంధం ఉందని పీజేఆర్ కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి ప్రకటన చేశారు. నియోజకవర్గ పర్యటనకు వచ్చిన అజారుద్దీన్ అనుచరులను విష్ణు వర్గం అడ్డుకుంది. విష్ణు కూడా పార్టీ హైకమాండ్‌పై కొన్నాళ్లుగా అసంతృప్తితో ఉన్నట్లుగా సమాచారం. ఇదే సమయంలో నియోజకవర్గంలో అజారుద్దీన్ పర్యటన అగ్గి రాజేసింది.వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి పార్టీ టికెట్ ఆశించిన అజహరుద్దీన్ స్థానికులతో సమావేశమయ్యేందుకు నియోజకవర్గానికి రాగానే నిరసనను ఎదుర్కోవాల్సి వచ్చింది. రెహ్మత్ నగర్ ప్రాంతంలో అజారుద్దీన్ సభ నిర్వహిస్తున్నప్పుడు కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్ రెడ్డి మద్దతుదారులు కొందరు నిరసనకు దిగారు. ఇది ఒకే పార్టీలోని మరో వర్గాన్ని రెచ్చగొట్టినట్లుగా మారింది. నియోజకవర్గంలోని రెహమత్ నగర్‌లో ఆ పార్టీ నేత, టీమిండియా మాజీ కెప్టెన్ అజారుద్దీన్ తన అనుచరులతో కలిసి ఓ సభను ఏర్పాటు చేశారు. ఆ సభను పీజేఆర్ కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి అనుచరులు నిరసన వ్యక్తం చేస్తూ అడ్డుకున్నారు. ఈ సారి ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున అజారుద్దీన్ పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. జూబ్లీహిల్స్ నుంచి అజారుద్దీన్ బరిలోకి దిగుతారనే ప్రచారానికి బలం చేకూరుస్తూ.. బుధవారం మొదటిసారి సోమాజిగూడ, ఎర్రగడ్డ, బోరబండ డివిజన్లలో పర్యటించారు. ఇదే విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లేందుకు తాను ప్రయత్నిస్తానని అన్నారు. తాను ఇక్కడ పర్యటన చేస్తున్నట్లుగా అజారుద్దీన్ ప్రకటించారు. మరి అధిష్టానం ఎవరివైపు మొగ్గు చూపుతుందో వేచి చూడాలి.


# ఐపీసీ.. సీసీపీ ఐఈఏ లకు గుడ్ బై

**జయభేరి, న్యూఢిల్లీ ఆగష్టు 11**

ప్రధాని నరేంద్ర మోదీ సారధ్యంలోని కేంద్ర ప్రభుత్వం సంచలనానికి తెరదీసింది. బ్రిటీష్ కాలం నాటి ఇండియన్ క్రిమినల్ చట్టాలైన ఐపీసీ, సీసీపీ ఐఈఏ స్థానాల్లో కొత్త చట్టాలను ప్రవేశపెట్టేందుకు సిద్దమైంది. ఐపీసీ స్థానంలో 'భారతీయ న్యాయ సంహిత' (కొత్త చట్టాన్ని తీసుకోరాబోతోంది. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలకమైన మూడు బిల్లులను నేడు (శుక్రవారం) లోక్‌సభలో ప్రవేశపెట్టారు. కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ స్థానంలో 'భారతీయ నాగరిక్ సురక్షా సంహిత', ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో 'భారతీయ సాక్ష్య' చట్టాలకు సంబంధించిన బిల్లులను సభలో ప్రవేశపెట్టారు.ఇక శాంతి భంగం కలిగించే నేరాలు, సాయుధ తిరుగుబాటులు, విధ్వంసకర చర్యలు, విజభనవాద కార్యకలాపాలు లేదా భారత ఐక్యత, సమగ్రతకు సంబంధించిన చట్టాలను సవరించిన చట్టాలలో చేర్చనున్నారు. మరోవైపు మహిళలు, పిల్లలు, హత్యలు, ప్రభుత్వ వ్యతిరేక నేరాలను కొత్త బిల్లుల్లో ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఇక తొలిసారిగా చిన్నచిన్న నేరాలకు సంఘసేవను శిక్ష విధించబోతున్నారు. అంతేకాదు.. లింగసమానత్వంతో కొత్తచట్టాలను రూపొందించారు.ఇక వ్యవస్థీకృత నేరాలు, ఉగ్రవాద కార్యకలాపాలు, ఉగ్రవాదానికి సంబంధించిన కొత్త కార్యకలాపాలను నియంత్రించేలా కఠినమైన శిక్షలను చేర్చారు. అంతేకాదు.. వేర్వేరు నేరాలకు సంబంధించిన జరిమానాలు, శిక్షలను పెంచారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాలను ప్రక్షాళన చేసి కొత్తవాటిని ప్రవేశపెట్టడమే లక్ష్యమని ఈ సందర్భంగా లోక్‌సభలో అమిత్ షా వ్యాఖ్యానించారు. కాగా ఇండియన్ పీనల్ కోడ్‌ను 1860లో ప్రవేశపెట్టారు.

**మూడు బిల్లుల్లోని ముఖ్యమైన మార్పులు..**

- మైనర్లను అత్యాచారం చేస్తే ఉరిశిక్ష.
- సామూహిక అత్యాచారానికి పాల్పడితే 20 ఏళ్ల జైలు.
- మూక దాడులకు ఏడేళ్ల జైలు.
- 7 సంవత్సరాలకుపైగా శిక్ష విధించే కేసుల్లో ఫోరెన్సిక్ సాక్ష్యాలు తప్పనిసరి.
- ఎక్కడి నుంచైనా ఈఎఫ్‌ఐఆర్ నమోదు చేయవచ్చు.
- సెర్చ్ ఆపరేషన్ చేస్తే సెర్చ్ వారెంట్‌తోపాటు ఎవరి వద్దకైనా వెళ్తే వీడియోగ్రఫీ చేయాల్సిందే.
- ఎఫ్‌ఐఆర్ నుంచి ఛార్జిషీట్ వరకు అన్ని డిజిటైలైజ్ చేయాలి.



# కోటి 24 లక్షల ఎకరాల్లో సాగు

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 11 :**

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యాక అసాధారణ రీతిలో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరిగింది. భారీ వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. అధిక వర్షాలతో ఓవైపు పంట నష్టం జరిగిన, మరోవైపు ఆ పరిస్థితి నుంచి బయట పడేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం ఈ సంవత్సరం సాధారణ సాగు విస్తీర్ణం 1.24 కోట్ల ఎకరాల్లో సాగు అవుతుందని వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతోంది. ఇదే సమయానికి గత ఏడాది 83.43 లక్షల ఎకరాల్లో సాగు జరిగిందని లెక్కల్లో చెప్పింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో వానకాలం సీజన్‌లో సాగు విస్తీర్ణం 1.24 కోట్ల ఎకరాలకు ఎగబాకింది. ఇప్పటి వరకు 95.78 లక్షల ఎకరాలకు 77 శాతం సాగు చేరిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. వరి సాధారణ సాగు విస్తీర్ణం 49.86 లక్షల ఎకరాలు కాగా ఇప్పటివరకు 36.06 లక్షల ఎకరాల్లో... అంటే 72 శాతం నాట్లు వేశారని తెలిపింది. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 50.59 లక్షల ఎకరాలు ఉండగా... 44.49 లక్షలు ఎకరాల్లో 87 శాతం సాగవుతుందని తెలియజేసింది. నాలుగు జిల్లాల్లో 100 శాతానికి పైగా సాగు.... నాలుగు జిల్లాల్లో సాగు విస్తీర్ణం 100 శాతానికిపైగా పెరిగింది. ఆయా జిల్లాల వారీగా చూస్తే మెదక్ 105.80, అదిలాబాద్ 103.90, కొమరం భీం ఆసిఫాబాద్ 102.19, నిజామాబాద్ 101.10 శాతం విస్తీర్ణంలో వివిధ పంటలు సాగయ్యాయి. అత్యంత తక్కువగా వనపర్తిలో 24.90 శాతం, ఆ తర్వాత మూలుగు 32.90 శాతం పంటలు సాగయ్యాయని అని అధికారులు నివేదిస్తున్నారు. జూన్ నెలలో 44 శాతం వర్షపాతం కొరత ఉండగా... జూలై నెలలో ఏకంగా 114 శాతం భారీ అధిక వర్షపాతం నమోదయింది. రాష్ట్రంలోని 19 జిల్లాల్లో అధిక వర్షపాతం, ఆరు జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదయింది. కానీ ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు అనేక చోట్ల పంటలు దెబ్బ తిన్నాయి. జొన్న, సజ్జ, మొక్కజొన్న, రాగులు, పప్పు దినుసులు, వేరుశనగ, సోయాబీన్ సాగును రైతులు ఇప్పటికే ప్రారంభించారని వివరించింది. వరి నాట్లు వచ్చే నెల మొదటి వారం వరకు సాగనున్నయని అప్పటివరకు రాష్ట్రంలో మొత్తం పంటల సాగు కోటి ఎకరాలను దాటుతుందని పేర్కొంది. జిల్లాల వారిగా సాగు చూసుకుంటే..... అదిలాబాద్, కొమరం భీం, నిజామాబాద్, మెదక్ జిల్లాలో 100 శాతానికి పైగా పంటలు సాగుతున్నట్లు వ్యవసాయ శాఖ నిర్ధారించింది. వనపర్తి లో 25 శాతం విస్తీర్ణంలోపే పంటలు సాగుతున్నాయని ప్రభుత్వానికి నివేదిక అందజేసింది.



ములుగు, మేడ్చల్ జిల్లాల్లో 40 శాతం, మంచిర్యాల, పెద్దపల్లి, సిద్దిపేట, వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, ఖమ్మం, రంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, గద్వాల, సూర్యాపేట జిల్లాలో 70 శాతం పంటలు సాగుతున్నాయి. మిగిలిన జిల్లాలు అంటే నిర్మల్, కామారెడ్డి, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, మహబూబాబాద్, భద్రాద్రి, సంగారెడ్డి, జనగామ, వికారాబాద్, నారాయణపేట, నల్గొండ, యాదాద్రి, జిల్లాలో 90 శాతం పంటలు సాగుతున్నాయి.

**పంటల వారీగా సాగు ప్రారంభం చూస్తే...**

మొక్కజొన్న 5.02 లక్షల సాగు విస్తీర్ణం(70శాతం), సోయాబీన్ 4.43 లక్షల ఎకరాలు (107 శాతం), జొన్న 21 వేల ఎకరాలు(26.74శాతం), చెరుకు 20 వేల ఎకరాలు(31.49శాతం), మినుములు 18 వేల ఎకరాలు(41 శాతం), పెసర్లు 49 వేల ఎకరాలు(39 శాతం), నువ్వులు 2 వేల ఎకరాలు (8 శాతం సాగు విస్తీర్ణం) లో ఉన్నాయి.

# ఎల్ అండ్ టీకే మెట్రో రెండో దశ పనులు

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 11 :**

విమానాశ్రయ మెట్రో ప్రాజెక్టు టెండర్ ఎల్ అండ్ టీ సంస్థకే చేజిక్కినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న రెండో దశకు గ్లోబర్ టెండర్లు పిలిచారు. అయితే రెండు బిడ్లు మాత్రమే దాఖలు అయ్యాయి. ఎల్ అండ్ టీ టిమిటెడ్, ఎన్సీసీ లిమిటెడ్ మాత్రమే పోటీ పడ్డాయి. గత నెల రోజులుగా మెట్రో అధికారులు, జనరల్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్ కలిసి.. ప్రాజెక్టు అమలులో ఆ రెండు కంపెనీల అనుభవం, సాంకేతిక, ఆర్థిక నివేదికలు, పత్రాలను అధ్యయనం చేశారు. మెట్రో నింబధనల్లో తొలిసారిగా పొందు పరిచిన ఇంజినీరింగ్, ప్రొక్యూర్ మెంట్, కన్ స్ట్రక్షన్ లో అనుభవనం, అర్హత ఉన్న ఎల్ అండ్ టీకే టెండర్ ఖరారు అయినట్లు ఒక అధికారి తెలిపారు. టెండర్ అధ్యయన సమాచారం, మెట్రో అధికారులు సిఫార్సులను నివేదించిన అనంతరం ప్రభుత్వ అనుమతితో త్వరలో ఈ విషయం ప్రకటించనున్నట్లు సమాచారం. మెట్రో రెండో దశలో మొదటి ప్రాధాన్యంగా రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు మొత్తం 31 కిలో మీటర్ల నిర్మాణానికి ప్రభుత్వ గత ఏడాది ఆఖరులో శంకుస్థాపన చేసింది. ప్రాజెక్టు వ్యయం రూ.6,250 కోట్లుగా అంచనా వేసింది. పూర్తిగా రాష్ట్ర సర్కారు నిధులతో చేపట్టారని నిర్ణయించింది. ఈపీసీ కాంట్రాక్టర్ ను ఎంపిక చేయడానికి హైదరాబద్ ఎయిర్ పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ ఇటీవల గ్లోబల్ టెండర్లను పిలిచింది. జనరల్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్ వ్యయం, ఆకస్మిక వ్యయం, మల్టీ మోడల్ ఇంటిగ్రేషన్ వంటివి మినహాయించి రూ.5,688 కోట్లకు టెండర్ పిలిచింది. హైదరాబాద్ లో మొదటి దశను చేపట్టిన, దేశంలోని వేర్వేరు నగరాల్లో మెట్రో రైల్ ప్రాజెక్టులను నిర్మించిన ఎల్ అండ్ టీ సంస్థ, బెంగళూరులో విమానాశ్రయ మెట్రో పనులు చేస్తున్న ఎన్సీసీ పోటీ పడ్డాయి. ఈ క్రమంలోనే ఎల్ అండ్ టీ సంస్థ ప్రాజెక్టును దక్కించుకుంది. అయితే శంషాబాద్ విమానాశ్రయ మెట్రోని ప్యాకేజీల వారీగా కాకుండా టెండర్ దక్కించుకున్న సంస్థే అన్నీ చూసుకునేలా ఈపీసీ పద్ధతిలో గ్లోబల్ టెండర్లు పిలిచారు. మెట్రో ప్రాజెక్టుల్లో ఈపీసీ టెండర్ పిలవడం ఇదే మొదటిది అని అధికారులు తెలిపారు. ఇందులో సివిల్ వర్క్స్ తో పాటు సిగ్నలింగ్, ఎలక్ట్రికల్, రోలింగ్ స్టాక్, స్టేషన్ ప్లానింగ్, ట్రాక్ పనులు, డిపోలు, ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్, విద్యుత్ స్కాడా వ్యవస్థ ఏర్పాటును టెండర్ దక్కించుకున్న సంస్థే చేపట్టాల్సి ఉంది.




మొదటి దశలో ఇవన్నీ ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో చేపట్టింది. కాకపోతే అది ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో చేపట్టిన ప్రాజెక్టు. విమానాశ్రయ మెట్రో పూర్తిగా ప్రభుత్వ ప్రాజెక్టు. పీపీసీలో చేసిన అనుభవం ఇక్కడ ఎల్ అండ్ టీ సంస్తకు సానుకూలంగా మారింది. ఈ నెలలో టెండర్ ఖరారు చేసి.. ప్రాజెక్టు దక్కించుకున్న సంస్థతో వచ్చే నెలలో మెట్రో పనులను ప్రారంభింపజేయాలని అధికార యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. హైదరాబాద్‌లోని రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు 31 కిలో మీటర్ల మార్గంలో తొమ్మిది మెట్రో స్టేషన్లు నిర్మించాలని హైదారాబ్ ఎయిర్ పోర్ట్ మెట్రో రైల్ భావిస్తోంది. రాయదుర్గం వద్ద మొదటి స్టేషన్ ప్రారంభం కాగా ఆ తర్వాతి స్టేషన్లు.. బయోడైవర్సిటీ కూడలి, నానక్ రాంగూడ కూడలి, నార్సింగి, అప్పా కూడలి, రాజేంద్రనగర్, శంషాబాద్ పట్టణం, విమానాశ్రయంలో జారీయ రహదారికి కొద్ది దూరంలో, విమానాశ్రయం టెర్మినల్ లో భూగర్భ మెట్రో స్టేషన్‌తో ముగియనున్నట్లు తెలుస్తోంది. అయితే వంపులు లేని చోట్ల స్టేషన్లు నిర్మిస్తారు.

మెట్రో ప్రయాణ వేగం, బ్రేకింగ్ తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని వాటిని ఖరారు చేస్తారు. అయితే భవిష్యత్తులో మరో నాలుగు స్టేషన్లు కూడా ఏర్పాటు చేసుకునేలా అలైన్ మెంట్ ను డిజైన్ చేశారు. భవిష్యత్తులో నార్సింగి, అప్పాకూడలి మధ్య మంచిరేవుల వద్ద ఒక స్టేషన్ ఏర్పాటు చేసే అవకాశం ఉంది. అలాగే అప్పాకూడలి, రాజేంద్రనగర్ మధ్యలో కిస్మత్ పూర్ లోనూ ఓ స్టేషన్ నిర్మిస్తారట. రాజేంద్రనగర్ నుంచి శంషాబాద్ పట్టణం మధ్యలో చాలా దూరం ఉంది. కాబట్టి ఇక్కడ కూడా ఓ స్టేషన్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. జనావాసాలు పెరిగితే మరో స్టేషన్ ను కూడా నిర్మించే యోచనలో హెచ్ఏఎంఎల్ ఉంది.




## కొత్త లోగొతో ఎయిర్ ఇండియా

**జయభేరి, ముంబై, ఆగస్టు 11 :**

గతేడాది టాటా సంస్థ చేతికి వెళ్లిన ఎయిర్ ఇండియా కంపెనీ తన కొత్త లోగోను ఆవిష్కరించింది. ఢిల్లీలో జరిగిన లైవ్ ఈవెంట్‌లో ఈ కొత్త లోగోను టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ ఆవిష్కరించారు. ఇది ఎయిర్‌లైన్ కొత్త ఐడెంటిటీ, రీబ్రాండింగ్‌లో భాగమని అన్నారు. 'అవధుల్లేని అవకాశాలు'ను ఈ లోగో ప్రతిబింబిస్తుందని అన్నారు. ఎయిర్ ఇండియాను ప్రపంచ స్థాయి విమానయాన సంస్థగా తీర్చిదిద్దే ప్రయాణం మొదలైందని చెప్పారుఎయిర్ ఇండియా కొత్త లోగో సింబల్ కు 'ది విస్టా' అని పేరు పెట్టారు. ఈ లోగోలో గోల్డెన్, రెడ్, పర్పుల్ కలర్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా చంద్రశేఖరన్ మాట్లాడుతూ.. వచ్చే 15 నెలల్లో అత్యుత్తమ అనుభవం, సాంకేతికత, కస్టమర్ సర్వీస్, సేవలతో ఎయిర్ ఇండియాను ప్రపంచంలోనే అత్యుత్తమ విమానయాన సంస్థగా తీర్చిదిద్దాలనుకుంటున్నామని చెప్పారు. గత 12 నెలల్లో, తాము అన్ని విషయాల్లోనూ సంస్థను మెరుగు పరిచామని అన్నారు. "కొత్త లోగో డిసెంబర్ 2023 నుండి విమానాలలో కనిపిస్తుంది. కొత్త లోగో ఎయిర్ ఇండియా ఉపయోగించే క్లాసిక్, ఐకానిక్ ఇండియన్ విండో నుండి ప్రేరణ పొందింది. ఎయిర్ ఇండియా ప్రయాణికులు డిసెంబర్ 2023 నుండి విమానాలలో కొత్త లోగోను చూస్తారు" అని చంద్రశేఖరన్ తెలిపారు. గత 12 నెలలుగా ఎయిర్ ఇండియా కోసం మెరుగైన టీమ్ ను ఏర్పాటు చేశామని, ఎయిర్‌లైన్స్ ఉద్యోగులందరినీ అప్‌గ్రేడ్ చేస్తున్నామని చెప్పారు. ఎయిర్ ఇండియా సీఈవో, ఎండీ క్యాంప్‌బెల్ విల్సన్ మాట్లాడుతూ.. ఈ కొత్త బ్రాండ్ లోగో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అతిథులకు సేవలందించే గ్లోబల్ ఎయిర్‌లైన్‌గా ఉండాలనే ఎయిర్ ఇండియా ఆశయాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. ఫ్యూచర్ బ్రాండ్ సహకారంతో కొత్త లోగో రూపొందించామని, ఎయిర్ ఇండియా మొదటి ఎయిర్‌బస్ A350 విమానం కొత్త లోగోతో వస్తుందని అన్నారు. ఆ విమానం తమ ఫ్లీట్ లో డిసెంబర్ 2023లో చేరుతుందని, అప్పటి నుంచి ఎయిర్ ఇండియా ప్రయాణికులు విమానాలపై ఈ కొత్త లోగోను చూస్తారని అన్నారు.

## గిత్తలకు ఫుల్ క్రేజ్

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 11 :**

తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఓ గిత్తకు ఫుల్ క్రేజ్ వచ్చింది. అది విక్రయానికి పెడితే ఏకంగా కళ్లు తిరిగే రేంజ్‌లో ధర పలికింది.సాధారణంగా ఒంగోలు జాతి గిత్తలు అంటేనే రైతులకు యమా క్రేజ్.. అందులోనూ పందెం గిత్తలకు మరింత డిమాండ్ ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో రికార్డు స్థాయిలో పందెం గిత్తలకు కోటి రూపాయలు ధర పలికింది. వివరాల్లోకి వెళితే.. ఆయనో పోలీస్ ఆఫీసర్.. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి. సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్‌కు చెందిన సుంకి సురేందర్ రెడ్డి ఏఎస్పీగా హైదరాబాదులో పనిచేస్తున్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన సురేందర్ రెడ్డికి వ్యవసాయంతో పాటు గిత్తల పెంపకం, దేశ, విదేశాలకు చెందిన పక్షులు, కుక్కలు, కోళ్లు, పొట్టేళ్ల పెంపకం ఫ్యాషన్ గా మారింది. ఓవైపు పోలీస్ ఆఫీసర్ గా విధులు నిర్వర్తిస్తూనే మరోవైపు గిత్తల పెంపకాన్ని కొనసాగిస్తున్నాడు. హుజూర్ నగర్ లోని తన వ్యవసాయ క్షేత్రంలో ఒంగోలు జాతికి చెందిన గిత్తలను పెంచుతున్నాడు. తాను పెంచుతున్న రెండు కోడెలకు భీముడు, అర్జునుడుగా పేరు పెట్టి ఆప్యాయంగా పిలుస్తుంటాడు. తెలుగు రాష్ట్రాల్లో 9 నెలల్లో జరిగిన 40కి పైగా ఎద్దుల పోటీల్లో ఈ గిత్తలు పాల్గొన్నాయి. ఈ కొడెలు 34 సార్లు ప్రథమ బహుమతి గెలుచుకున్నాయి. తాను పెంచుకున్న గిత్తల్లో ఈ జతను రూ.కోటి 10 లక్షల రూపాయలకు అమ్మారు. వీటిని ఏపీలోని బాపట్ల జిల్లా కొల్లూరు మండలం అనంతారం గ్రామానికి చెందిన రైతు సబ్జా సతీష్ కొనుగోలు చేశాడు. తెలుగు రాష్ట్రాల్లోనే గిత్తల అమ్మకాలు, కొనుగోళ్లలో ఇది రికార్డు స్థాయి ధర అని ఎసిపి సురేందర్ రెడ్డి చెబుతున్నారు. వ్యవసాయ ఉత్పత్తిగా భావించే ఒంగోలు జాతి గిత్తలకు డిమాండ్.

# పర్వతాపూర్ రోడ్డు విస్తరణ పనుల పురోగతి పై సమీక్ష

**జయభేరి, మేడిపల్లి :**
పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణం, పీర్జాదిగూడ పర్వతాపూర్ రోడ్డు విస్తరణ పనుల పురోగతి పై సంబంధిత SNDP, HMDA అధికారులు, కాంట్రాక్టర్, మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నగర పరిధిలో వరదముంపుకు శాశ్వత పరిష్కారం కొరకు నిర్మిస్తున్న స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని కాంట్రాక్టర్, అధికాలకు సూచించారు. పర్వతాపూర్ చెరువు వరకు డ్రైన్ పనులు పూర్తయినందున బోడుప్పల్ చింతల చెరువు, సుద్దకుంట చెరువు, ఆల్మస్ కుంట, పీర్జాదిగూడ పెద్ద చెరువు నుండి కూడా పనులు త్వరగా ప్రారంభించాలన్నారు. పీర్జాదిగూడ 4 లైన్ల రోడ్ విస్తరణలో భాగంగా ఎలక్ట్రికల్ పోల్స్, ట్రాన్సఫరంలను వేరే చోటకు మార్చడం మొదలైన పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. అదే విధంగా రోడ్డు విస్తరణ లో భాగంగా స్థలం, ఇల్లు కోల్పోతున్న నిర్వాసితులకు TDR లను త్వరగా అందజేయాలని అధికారులకు ఆదేశించారు. రోడ్డు విస్తరణ పనులలో భాగంగా పాత పైప్ లైన్ స్థానంలో నూతన మంచి నీటి పైప్ లైన్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలను జలమండలి అధికారులకు సూచించారు. వివిధ కాలనీల నుండి చెరువులకు చేరుతున్న డ్రైనేజి నీటిని బైపాస్ ఏర్పాటు చేసి మూసికి చేరేవిధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలోపీర్జాదిగూడ కమీషనర్ ఇస్లావత్ నమ్య, బోడుప్పల్ కమీషనర్ వేణుగోపాల్ రెడ్డి, SNDP EE నారాయణ, DE పవన్ కుమార్, కాంట్రాక్టర్ వినీత్ రెడ్డి, పీఎంసీ DEE శ్రీనివాస్, AE బిక్షపతి, HMDA EE అప్పారావ్, AE రమేష్ బాబు, రోడ్ కాంట్రాక్టర్ పూర్ణచందర్ రావు, HMWS &SB కాంట్రాకర్ట్, HMDA DYEE సుభాష్, CI గోవర్ధన్ గిరి తదితరులు పాల్గొన్నారు.





## ఓటరు నమోదుకు మరో చాన్స్ పోస్టర్ ఆవిష్కరణ

**జయభేరి, మేడిపల్లి :**
ఎమ్మెస్సార్ యువసేన ఆధ్వర్యంలో ఓటరు నమోదుకు మరో చాన్స్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. మాజి ZPTC సభ్యులు, BRS పార్టీ BMC అధ్యక్షులు మంద సంజీవరెడ్డి పోస్టర్ ను ఆవిష్కరించారు. 18 సంవత్సరాలు నిండిన పౌరులు ఓటును నమోదు చేసుకోని వచ్చే శాసనసభ ఎన్నికల్లో BRS పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని మంద సంజీవరెడ్డి యువతకు పిలుపునిచ్చారు. ఈ యొక్క కార్యక్రమంలో కార్పొరేటర్ చీరాల నరసింహ, శ్రీహరి గౌడ్, మీసాల యాదగిరి, మైసగళ్ల మల్లేష్, సత్యమూర్తి యాదవ్, చంటి శ్రీనివాస్, కె.పాండురంగ, తాల్క శత్రుఘ్న, జి కుమార్, మోతే రాజు, ఉప్పరి విజయ్, సంతోష్, శ్రీకాంత్, ధర్మానాయక్, వివిధ కాలనీ అధ్యక్షులు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ప్రజలు ప్రభుత్వ మార్పు కోరుకుంటున్నారు

- కర్ణాటక ఎమ్మెల్యే, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జ్ రిజ్వాన్ అర్షద్...
- తన పనుల కోసం ఎవరి కాళ్లయినా మొక్కే చప్రాసి మంత్రి మల్లారెడ్డి...
- రాజకీయాల్లో మంత్రి మల్లారెడ్డి మన ముందు బచ్చా....
- ఆయన ఎంపీ కాకముందే ఇక్కడ అనేక మంది ఎంపీలు, ఎంపీటీసీలు అయ్యారు...
- మేడ్చల్ నియోజకవర్గ వర్గ స్థాయి ముఖ్యనాయకుల సమావేశంలో
- మంత్రి మల్లారెడ్డిపై నిప్పులు చెరిగిన టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్.





**జయభేరి, మేడిపల్లి :**
కాంగ్రెస్ పార్టీలో సాధారణ స్థాయి కార్యకర్త కూడా ఎమ్మెల్యే కావచ్చనే దానికి నిదర్శనం తానేనని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు రాహుల్ గాంధీ తనకు టికెట్టు ఇచ్చి చేయి పట్టుకొని గెలిపించడం వల్లనే తాను ఎమ్మెల్యేని అయ్యానని కర్ణాటక ఎమ్మెల్యే, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జ్ రిజ్వాన్ అర్షద్ అన్నారు. మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు నందికంటి శ్రీధర్ ఆధ్వర్యంలో మేడిపల్లి లోని సంపూర్ణ హోటల్లో నిర్వహించిన మేడ్చల్ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి కర్ణాటక ఎమ్మెల్యే, మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ రిజ్వాన్ అర్షద్ తో పాటుగా టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సరిత వెంకటేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కర్ణాటక ఎమ్మెల్యే, మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ రిజ్వాన్ అర్షద్ మాట్లాడుతూ... తెలంగాణలో ప్రజలు ప్రభుత్వ మార్పును కోరుకుంటున్నారని, ఓటర్లే మనల్ని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని, గెలిచేందుకు మనం సిద్దంగా ఉండాలన్నారు. అనంతరం టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ... తన పనుల కోసం ఎలాంటి పనైనా చేసే చెప్రాసి మంత్రి మల్లారెడ్డి అన్నారు. నాడు టిడిపి హయాంలో చంద్రబాబు కాళ్ళుమొక్కి రెండు కాలేజీలకు అనుమతులు తెచ్చుకున్నాడని, మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగానే వైయస్సార్ కాళ్ళు మొక్కి మరో ఎనిమిది విద్యాసంస్థలకు అనుమతులు తెచ్చుకున్నారని, అధికారంలో ఉన్న వారి కాళ్లు మొక్కి వారికి చప్రాసి చేసి తన పనులు చేసుకోవడం మంత్రి మల్లారెడ్డికి అలవాటేనన్నారు. రానున్న ఎన్నికల్లో మనమందరం ఒక్కటై పనిచేస్తే మన గెలుపు నల్లేరు మీద నడికేనన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గానికి చెందిన మాజీ జడ్పీటీసీలు, మున్సిపల్ కార్పొరేషన్ల అధ్యక్షులు, కార్పొరేటర్లు, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీలు, మున్సిపాలిటీల అధ్యక్షులు, వివిధ గ్రామపంచాయతీల సర్పంచ్లు, వార్డు సభ్యులు, మాజీ వార్డు సభ్యులు, ఏ బ్లాక్, బి బ్లాక్ అధ్యక్ష కార్యదర్శులు, ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ఎస్సీ సెల్, ఎస్టీ సెల్, యూత్ కాంగ్రెస్, మైనార్టీ సెల్, ఓబీసీ సెల్ ల అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, మహిళా సేవాదళ్ ల అధ్యక్షురాళ్లతో పాటు అనుబంధ సంఘాలకు చెందిన ముఖ్య నాయకులు, ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారు.





## నూతన ఓటర్ల నమోదు
### ఓటర్ కార్డు లోని తప్పలను సరి చేయించడం

**జయభేరి, మేడిపల్లి :**
మన 5వ డివిజన్ IICT కమ్యూనిటీ హాల్ లో నిర్వహించినటువంటి "కొత్త ఓటరు నమోదు" కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి పాల్గొని డివిజన్ వాసులకు నూతన ఓటర్ల నమోదు, ఓటర్ కార్డు లోని తప్పులను సరి వున్నచో నమోదు చేయించడం జరిగింది. తదనంతరం కార్పొరేటర్ పద్మా రెడ్డి మాట్లాడుతూ... సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం IICT కమ్యూనిటీ హాల్ లో ఉంటుంది. కావున డివిజన్ వాసులు వచ్చి ఈ నూతన ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో బోడుప్పల్ మున్సిపల్ జాన్ పాల్, పన్నాల బుచ్చి రెడ్డి, బి ఆర్ స్ పార్టీ 5వ డివిజన్ అధ్యక్షులు పబ్బు సత్యనారాయణ, కరుణాకర్, రుద్ర దాస్, మహేందర్ రెడ్డి, ముకేశ్, శ్యామ్ సుందర్, డివిజన్ మహిళలు పాల్గొన్నారు.



# శ్రీ షిరిడి సాయిబాబా ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

- చిల్కానగర్ డివిజన్లోని ధర్మపురి కాలనీలో శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో మంత్రి సత్యవతి రాథోడ్ ప్రత్యేక పూజలు



**జయభేరి, ఉప్పల్ :**
చిల్కానగర్ డివిజన్లోని ధర్మపురి కాలనీలో శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో 25 వసంతాల రజితోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి బాబా బ్రోచర్ ఇనాగ్రేషన్ చేయడం జరిగింది. సాయిబాబా ఆలయ కమిటీ అధ్యక్షులు మధుకర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు మంత్రి సత్యవతి రాథోడ్ ని పూర్ణ కుంభ స్వాగతంతో తాళమేళాలతో ఆలయంలోకి స్వాగతం పలుకుతూ తీసుకువెళ్లడం జరిగింది. మంత్రి సత్యవతి రాథోడ్, డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ కలిసి శ్రీ షిరిడి సాయిబాబా అర్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ... ధర్మపురి కాలనీలో షిరిడి సాయిబాబా ఆలయం పక్కనే తన నివాసం ఉండడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని, ఎంతో చిన్నగా ఉన్నా సాయిబాబా ఆలయం దిన దిన అభివృద్ధి చెందుతూ భక్తులు కూడా పెద్ద ఎత్తున రావడం ధర్మపురి కాలనీ సాయిబాబా ఆలయంలో భక్తులు ఎటువంటి కోరికలు కోరిన అవి వెంటనే నెరవేరుతున్నాయి కాబట్టే, దానికి నిదర్శనమే నేను మంత్రి కావడం నాకు ఇన్చార్జిగా అప్పజెప్పిన చిలుకానగర్ డివిజన్లో కార్పొరేటర్ గీతా ప్రవీణ్ గెలవడం అని ఈ సందర్భంలో వారు గుర్తు చేశారు. సాయిబాబా ఆలయ అభివృద్ధి కోసం తాను ఎప్పుడూ ముందుంటానని ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా ముందుండి మొదటిగా అందిస్తానని తెలిపారు. నేను ఇన్చార్జిగా వచ్చి గెలిపించిన కార్పొరేటర్ గీతా ప్రవీణ్ బాగా పనిచేస్తున్నారా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు.
ఈ కార్యక్రమంలో బి ర్ స్ పార్టీ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి, మహమూద్, సుందర్, ఆలయ కమిటీ సభ్యులు వేణుగోపాల్, శ్రీనివాస్, మాణిక్ ప్రభు, భాస్కర్ రెడ్డి, శర్మ, సురేందర్, రామారావు, పర్వేష్, పెద్ద ఎత్తున భక్తులు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, ఆలయ వాలంటీర్స్ మొదలగువారు పాల్గొన్నారు.





**ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు భద్రాద్రి రాములోరిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, నాయకులు జిన్నారం వెంకటేష్ గౌడ్, రాజేష్, రచ్చ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.**
జయభేరి, మేడిపల్లి



## ర్కే సొసైటీలో మహిళలకు మరో టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్...!

**జయభేరి, కూకట్పల్లి :**
కూకట్పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఆర్కే సొసైటీ కమ్యూనిటీ హాల్లో కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ ఖార్డు స్వచ్ఛంద సంస్థ నుండి స్కిల్ కోఆర్డినేటర్ లక్ష్మణ్ తో కలిసి మైనారిటీ మహిళలకు టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్ కొరకు కమ్యూనిటీ హాల్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ--- ఖార్డు స్వచ్ఛంద సంస్థ ద్వారా స్కిల్ భారత్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు స్వయం ఉపాధి కొరకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చొరవతో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని త్వరలో ఆర్కే సొసైటీ కమ్యూనిటీ హాల్లో మైనారిటీ మహిళల కొరకు ప్రారంభించబోతున్నామని ఈ సందర్భంగా కార్పొరేటర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ సుభాన్, షేక్ ఇస్మాయిల్, నరసింహ, సలీం, తాజ్ బి, రుబీనా తదితరులు పాల్గొన్నారు.

# బర్త్ డే రోజున తీసిన ఓ ఫన్ మూమెంట్




మన టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా ఇప్పుడు నటిస్తున్న లేటెస్ట్ చిత్రం "గుంటూరు కారం" కోసం అందరికీ తెలిసిందే. మరి ఈ చిత్రం షూటింగ్ గ్యాప్ లోనే మహేష్ తన బర్త్ డే ని ఫ్యామిలీతో జరుపుకోగా తన పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన అందరికీ మహేష్ థాంక్స్ చెప్పాడు.

ఇక ఇదిలా ఉండగా తన బర్త్ డే రోజున తీసిన ఓ ఫన్ మూమెంట్ ని అయితే పిక్ గా తన భార్య నమ్రత షేర్ చేయడం ఫ్యాన్స్ కి హ్యాపీ మూమెంట్ గా మారింది. అయితే తమ వెకేషన్ లో ఓ మైదానంలో నమ్రత ఒడిలో పడుకుని చాలా సింపుల్ గా ఉన్నారు. అయితే ఇది మహేష్ బర్త్ డే రోజునే అని ఓ లేజీ బర్త్ డే అంటూ నమ్రత పోస్ట్ చేశారు. దీనితో ఇది మంచి ఫన్ మూమెంట్ గా మారింది. ఇక ఈ పిక్ ని అయితే మహేష్ వారసుడు గౌతమ్ ఘట్టమనేని క్లిక్ చేసాడు. దీనితో ఫ్యాన్స్ లో ఈ పిక్ వైరల్ గా మారింది. ఇక లేటెస్ట్ గానే మహేష్ ఈ వెకేషన్ ని ముగించి హైదరాబాద్ కి రాగ గుంటూరు కారం షూట్ ని రీస్టార్ట్ చేయనున్నారు.

# లాంఛనంగా దుమారం సినిమా షూటింగ్ ప్రారంభం

మల్లిక్ బాబు, వినయ్, ఇషా, ప్రియాన్స్ హీరో హీరోయన్లుగా నటిస్తున్న సినిమా "దుమారం". ఈ సినిమాలో సుమన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని జీఎల్బీ సినిమా బ్యానర్ పై జీఎల్బీ శ్రీనివాస్ నిర్మిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సందర్భంగా దర్శక నిర్మాత జీఎల్బీ శ్రీనివాస్ మాట్లాడుతూ నాయి బ్రహ్మణుల జీవితాల నేపథ్యంతో సాగే చిత్రమిది. పూర్తి కమర్షియల్ అంశాలతో సాగుతుంది. సోమవారం నుంచి కొమురవెల్లిలో చిత్రీకరణ కొనసాగిస్తాం. వచ్చే నెల నుంచి కొత్త షెడ్యూల్ ఉంటుంది. హీరో తండ్రి పాత్రలో సుమన్ గారు నటిస్తున్నారు. ఆయనతో నేను చేస్తున్న మూడో చిత్రమిది. సుమన్ మాట్లాడుతూ జీఎల్బీ శ్రీనివాస్ తో నాకు మంచి స్నేహం ఉంది. నాయి బ్రాహ్మణుల జీవితాలు, ఈ వృత్తిలో వారు పడుతున్న ఇబ్బందులను ఈ సినిమాలో చూపిస్తున్నాం. నేను ఇందులో బార్బర్ క్యారెక్టర్ చేస్తున్నాను. మనం అందంగా ఉంటున్నామంటే కారణం వాళ్లే. మంచి ఎంటర్ టైన్ మెంట్, సందేశం అన్నీ కథలో ఉన్నాయి అన్నారు. హీరో మల్లిక్ బాబు మాట్లాడుతూ మాది ఖమ్మం జిల్లా. హైదరాబాద్ లో ఉద్యోగం చేసేవాడిని. లాక్ డౌన్ లో జాబ్ వదిలేసి ఇక యాక్టింగ్ మీద దృష్టి పెట్టాలని అనుకున్నా. జీఎల్బీ శ్రీనివాస్ నాకు హీరోగా అవకాశం ఇచ్చారు. తొలి చిత్రంలోనే మాస్ క్యారెక్టర్ దొరకడం సంతోషంగా ఉంది అన్నారు. హీరోయిన్ ఇషా మాట్లాడుతూ ఈ చిత్రంలో హీరోయిన్ గా అవకాశం దక్కినందుకు సంతోషంగా ఉంది. ఒక మంచి మూవీతో టాలీవుడ్ కు పరిచయం అవుతున్నా. కో ప్రొడ్యూసర్ తిరుపతి రాజు మాట్లాడుతూ ధుమారం సినిమాకు కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తూనే ఇందులో విలన్ కొడుకు క్యారెక్టర్ లో నటిస్తున్నాను. ఈ క్యారెక్టర్ కోసం డైరెక్టర్ శ్రీనివాస్ ట్రైనింగ్ ఇప్పించారు. మంచి మూవీ అవుతుంది అన్నారు. మల్లిక్ బాబు, వినయ్, ఇషా, ప్రియాన్స్, రాజు బి యాదవ్, లక్ష్మీ రావు హైమావతి, ఎంసుబ్బరాజు, కేఎస్ దేవి, నరసింహ, నవల్ కిషోర్ అగర్వాల్, మహేష్ గూడుగుంట్ల, మల్లాది శాస్త్రి తదితరులు.





# 'చంద్రముఖి 2' వినాయక చవితికి సినిమా గ్రాండ్ రిలీజ్

స్టార్ కొరియోగ్రాఫర్, డైరెక్టర్, యాక్టర్ రాఘవ లారెన్స్ హీరోగా నటిస్తోన్న లేటెస్ట్ భారీ బడ్జెట్ మూవీ 'చంద్రముఖి 2'. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కంగనా రనౌత్ టైటిల్ పాత్రలో నటిస్తోంది. సీనియర్ డైరెక్టర్ పి.వాసు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. డిఫరెంట్ కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రాలతో పాటు భారీ బడ్జెట్ చిత్రాలను నిర్మిస్తోన్న అగ్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ ఈ సినిమాను అన్‌కాంప్రమైజ్‌డ్‌గా నిర్మిస్తోంది. సుభాస్కరన్ నిర్మాత. శుక్రవారం ఈ సినిమా నుంచి 'స్వాగతాంజలి...' అనే లిరికల్ పాటను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో కంగనా రనౌత్ అభరణాలను ధరించి రాజనర్తకి చంద్రముఖిలా డాన్స్ చేయటాన్ని చూడొచ్చు. ఇక సినిమా కోసం వేసిన సెట్స్, కంగనా రనౌత్, రాఘవ లారెన్స్ కాస్ట్యూమ్స్ వావ్ అనిపిస్తున్నాయి. ఇక ఆస్కార్ విన్నర్ ఎం.ఎం.కీరవాణి సంగీత సారథ్యంలో పాట వినసొంపుగా ఉంది. శ్రీనిధి తిరుమల పాడిన ఈ పాటను చైతన్య ప్రసాద్ రాశారు. 2005లో పి.వాసు దర్శకత్వంలో రూపొందిన 'చంద్రముఖి' సినిమా ఎంత పెద్ద బ్లాక్ బస్టర్ హిట్ అయ్యిందో అందరికీ తెలిసిందే. హారర్ జోనర్‌లో సరికొత్త సెన్సేషన్‌ను క్రియేట్ చేసిన చంద్రముఖి చిత్రానికి కొనసాగింపుగా ఇప్పుడు 'చంద్రముఖి 2' సినిమాను రూపొందిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ మూవీకి ఆర్.డి.రాజశేఖర్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. జాతీయ అవార్డ్ గ్రహీత తోట తరణి ప్రొడక్షన్ డిజైనర్, ఆంథోని ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు. 'చంద్రముఖి 2'ను వినాయక చవితికి ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ లెవల్లో విడుదల చేస్తున్నారు. నటీనటులు: రాఘవ లారెన్స్, కంగనా రనౌత్, వడివేలు, లక్ష్మీ మీనన్, మహిమా నంబియార్, రాధికా శరత్ కుమార్, విఘ్నేష్, రవిమారియ, శృష్టి డాంగే, శుభిక్ష, వై.జి.మహేంద్రన్ రావు రమేష్, సాయి అయ్యప్పన్, సురేష్ మీనన్, శత్రు, టి.ఎం.కార్తీక్



# సమంత లేటెస్ట్ లుక్

ప్రస్తుతం సమంత రెస్ట్ మోడ్ లో ఉంది. సినిమాలకు విరామం ప్రకటించి ప్రశాంతమైన జీవితం గడుపుతోంది. బిజీ లైఫ్ కి బై బై చెప్పేసి స్నేహితులతో కలిసి విదేశాలు చుట్టేస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా బయటకొచ్చిన సమంత లేటెస్ట్ లుక్ చూసి పరేషాన్ అవుతున్నారు నెటిజన్లు. తనకు నచ్చిన జీవితాన్ని అనుభవిస్తూ ఎంజాయ్ చేస్తున్న సమంత.. న్యూ లుక్ లోకి మారిపోయింది. ఆరోగ్యం పట్ల పూర్తి శ్రద్ధ తీసుకుంటూ వర్కవుట్స్ చేస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా ఆమె షేర్ చేసిన కొన్ని పిక్స్ వైరల్ గా మారాయి. కళ్ళజోడు ధరించి కాస్త డిఫరెంట్ లుక్ లో కనిపించింది సమంత. మేకప్ లేకుండా ఆమె లుక్ స్పెషల్ అట్రాక్షన్ అయింది. అయితే ఈ పిక్ చూసి సమంత ఫేస్ లో చాలా మార్పు వచ్చిందంటూ కామెంట్లు పెడుతున్నారు నెటిజన్లు. ఆరు నెలలు కష్టంగా గడిచాయని రీసెంట్ గా సమంత చెప్పడం విశేషం. అంటే అనారోగ్యంతో పోరాడుతూనే సమంత తాను కమిటైన ప్రాజెక్టులు ఫినిష్ చేసిందని చెప్పుకోవచ్చు. ఇది కెరీర్ పట్ల ఆమె సిన్సియారిటీని స్పష్టం చేస్తోంది. జులై 13న సిటాడెల్ షూట్ కంప్లీట్ చేసింది సమంత. మరోవైపు విజయ్ దేవరకొండతో కలిసి ఖుషీ సినిమా పూర్తి చేసింది. శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాను రొమాంటిక్ లవ్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

# దర్శకేంద్రుడి చేతిలోంచి చందమామ కథలోన.. పాట

రక్షిత్ అట్లూరి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "ఆపరేషన్ రావణ్". ఈ చిత్రాన్ని ధ్యాన్ అట్లూరి నిర్మాణంలో న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్ గా దర్శకుడు వెంకట సత్య రూపొందిస్తున్నారు. సంగీర్తన విపిన్ హీరోయిన్ గా నటిస్తోంది. తాజాగా ఈ సినిమా నుంచి చందమామ కథలోన అనే లిరికల్ పాటను దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు గారు విడుదల చేశారు. టీమ్ కు తన ఆశిస్సులు అందజేశారు. శరవణ వాసుదేవన్ సంగీతాన్ని అందించిన ఈ పాటకు పూర్ణాచారి లిరిక్స్ రాయగా.. హరి చరణ్, గీతామాధురి పాడారు. చందమామ కథలోన, అందమైన పిల్లేనా, కళ్లముందు కదిలిందా, తుళ్లి తుళ్లి పడ్డానా.. అంటూ ప్రేయసి అందాన్ని పొగుడుతూ సాగుతుందీ పాట. ఈ సినిమాలో రాధికా శరత్ కుమార్, చరణ్ రాజ్, తమిళ నటుడు విద్యా సాగర్ ఇతర కీలక పాత్రల్లో నటించడం విశేషం. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న "ఆపరేషన్ రావణ్" సినిమా త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. నటీనటులు: రక్షిత్ అట్లూరి, సంగీర్తన విపిన్, రాధికా శరత్ కుమార్, చరణ్ రాజ్, కాంచి, రాకెట్ రాఘవ, రఘు కుంచె, కెఎ పాల్ రాము, విద్యా సాగర్, టీవీ 5 మూర్తి, కార్తీక్ తదితరులు



# ఓటీటీలో ఆదిపురుష్

పాన్ ఇండియా హీరో ప్రభాస్ నటించిన రీసెంట్ మూవీ 'ఆదిపురుష్' ఎటువంటి గుట్టు చప్పుడు కాకుండా ఓటిటిలోకి వచ్చేసింది. మేకర్స్ దీనిపై ఎటువంటి ముందస్తు సమాచారం గానీ, ప్రమోషన్స్ కానీ చేయకుండా అర్ధరాత్రి నుంచి ప్రముఖ ఓటీటీ అమెజాన్ ప్రైమ్ లో 'ఆదిపురుష్' సినిమాని రిలీజ్ చేశారు. ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ లో 'ఆదిపురుష్' తెలుగుతోపాటు తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. అయితే హిందీ భాషలో స్ట్రీమింగ్ పై ఇంకా ఎటువంటి అప్డేట్ లేదు. హిందీ తప్ప మిగతా అన్ని భాషల్లో ఈ సినిమాని అమెజాన్ ప్రైమ్ స్ట్రీమింగ్ కి అందుబాటులోకి తీసుకొచ్చింది. మరో షాకింగ్ న్యూస్ ఏంటంటే, సినిమా ఫ్రీగా కాకుండా రెంటల్ విధానంలో స్ట్రీమింగ్ అవుతోంది. 'ఆదిపురుష్'ని అమెజాన్ ప్రైమ్ లో చూడాలంటే సబ్స్క్రిప్షన్ తో పాటు అదనంగా రూ.279 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. ఉచితంగా చూడాలంటే మరో వారం రోజులు ఆగాల్సిందే. వచ్చే వారం నుంచి ఫ్రీ స్ట్రీమింగ్ ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నిజానికి థియేటర్స్ లో విడుదలైన ఈ సినిమా డిజాస్టర్ టాక్ ని సొంతం చేసుకుంది. అయినా కూడా ఇప్పుడు ఓటీటీలో ఫ్రీగా కాకుండా రెంటల్ విధానంలో స్ట్రీమింగ్ కి అందుబాటులోకి తీసుకురావడం గమనార్హం. రిలీజ్ కు ముందు 'ఆదిపురుష్' పై ఓ రేంజ్ లో హై క్రియేట్ అవడంతో అమెజాన్ ప్రైమ్ సంస్థ ఈ సినిమా డిజిటల్ రైట్స్ ని సుమారు రూ.250 కోట్లకు కొనుగోలు చేసినట్లు ప్రచారం జరిగింది. కానీ భారీ అంచనాలతో థియేటర్స్ లోకి వచ్చిన ఈ సినిమా ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేదు.రామాయణం ఇతిహాసం ఆధారంగా రూపొందిన ఈ సినిమాను బాలీవుడ్ డైరెక్టర్ ఓం రౌత్ తెరకెక్కించారు. రెట్రో ఫైల్స్ సమర్పణలో సుమారు రూ.500 కోట్ల భారీ బడ్జెట్ తో టి సిరీస్ బ్యానర్ పై భూషణ్ కుమార్ ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో నిర్మించారు. సినిమాలో శ్రీరాముడిగా ప్రభాస్, జానకి దేవికా కృతి సనన్ నటించారు. ఇక రావణుడిగా బాలీవుడ్ అగ్ర నటుడు సైఫ్ అలీ ఖాన్ నటించగా, హనుమంతుడిగా దేవదత్తా నగే, లక్ష్మణుడిగా సన్నిసింగ్ కనిపించారు. జూన్ 16న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం మొదటి మూడు రోజుల్లో రూ.350 కోట్లకు పైగా కలెక్షన్స్ ని అందుకుంది. ఆ తర్వాత నుంచి ఒక్కసారిగా కలెక్షన్స్ భారీగా పడిపోయాయి. దీంతో ఈ ఏడాది నిర్మాతలకు నష్టాలను మిగిల్చిన సినిమాలో 'ఆదిపురుష్' కూడా ఒకటిగా నిలిచింది.సినిమాలో విజువల్ ఎఫెక్ట్స్, రావణాసురుడి పాత్రతో పాటు ఇతర పాత్రల లుక్స్ పై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. అంతేకాదు రామాయణాన్ని వక్రీకరించారంటూ, హిందువుల మనోభావాన్ని దెబ్బతీసారంటూ పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సైతం చిత్ర బృందంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విడుదలకు ముందు నుంచే ఈ సినిమా ఎన్నో వివాదాలను ఎదుర్కొంది. 'సాహో', 'రాధే శ్యామ్' లాంటి బ్యాక్ టు బ్యాక్ ఫ్లాప్స్ తో తీవ్ర నిరాశలో ఉన్న ప్రభాస్ ఫ్యాన్స్ ను 'ఆదిపురుష్' మరోసారి డిసప్పాయింట్ చేసిందనే చెప్పాలి.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com